# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com  E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ శనివారం 22-10-2022 RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :29 సంచిక: 63 పేజీలు:6 వెల: రూ.1/-


## మెప్మాతో పాటు స్త్రీ నిధి కి కేటాయించిన లక్ష్యాలు, సాధించిన ప్రగతిపై సమీక్ష

మెదక్, అక్టోబర్ 2: నేటినిజం (ప్రతినిధి): స్త్రీ నిధి రుణాల లక్ష్యంలో పట్టణ పేదరిక నిర్మూల సంస్థ (మెప్మా), స్త్రీ నిధి కి ఈ ఆర్థిక సంవత్సరం నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకునే విధంగా అధికారులు, సిబ్బంది అంకితభావంతో పనిచేయాలనీ మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ ఇందిర సూచించారు. శుక్రవారం కలెక్టరేట్ లోని మెప్మా కార్యాలయంలో మెప్మా తో పాటు స్త్రీ నిధి కి కేటాయించిన లక్ష్యాలు, సాధించిన ప్రగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఇందిర మాట్లాడుతూ జిల్లాలోని తూప్రాన్, మెదక్, నర్సాపూర్, రామాయంపేట మునిసిపాలిటీలకు 16 కోట్ల 12 లక్షల స్త్రీ నిధి రుణాలు అందించాలని లక్ష్యం కాగా ఇప్పటి వరకు 2 కోట్ల 29 లక్షలు మాత్రమే అందించామని అన్నారు. మార్చి నాటికి వంద శాతం రుణాలు అందించే దిశగా అందరు సమన్వయంతో ఇప్ప టి నుండే కష్టపడి పనిచేయాలని హితవు చెప్పారు. స్త్రీ నిధి రుణాలు అందించడంలో రామాయంపేట మున్సిపాలిటీ 2020-21 లో జిల్లాలో మొదటి స్థానంలో నిలిచి అవార్డు తీసుకోవడం జరిగిందని ఆమె తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్ చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. ఈ సమావేశంలో స్త్రీ నిధి రీజనల్ మేనేజర్ గంగారాం, టౌన్ మిషన్ కోఆర్డినేటర్ సునీత, జిల్లా ప్రాజెక్ట్ అధికారి సువన్ , కో ఆర్డినేటర్లు ఆసియా, దేవపాల, , స్త్రీ నిధి కో ఆర్డినేటర్లు మహేందర్, ఐలమ్మ, కరుణాకర్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

## డీఏవీ స్కూల్ గుర్తింపును రద్దు చేయండి : మంత్రి సబితా ఇంద్రారెడ్డి

హైదరాబాద్, అక్టోబర్ 21:ఎల్‌కేజీ బాలికపై లైంగిక వేధింపులకు కారణమైన బంజారాహిల్స్ లోని బీఎస్‌డి డీఏవీ పాఠశాల గుర్తింపును తక్షణమే రద్దు చేయాలని విద్యాశాఖ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి జిల్లా విద్యా శాఖాధికారిని ఆదేశించారు. ప్రస్తుతం ఈ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు విద్యా సంవత్సరం నష్టపోకుండా ఉండేలా పక్కనే ఉన్న పాఠశాలల్లో సర్దుబాటు- చేయాలని సూచించారు. ఈ విషయంలో విద్యార్థుల తల్లిదండ్రుల సందేహాలను నివృత్తి చేసే బాధ్యత పూర్తిగా డీఈవోదేనని స్పష్టం చేశారు.

ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన భద్రతా పరమైన చర్యలను ప్రభుత్వానికి సూచించేందుకు విద్యా శాఖ కార్యదర్శి నేతృత్వంలో ఒక కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ కమిటీలో పాఠశాల విద్యా శాఖ సంచాలకులు, స్త్రీ శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి, పోలీస్ విభాగంలో మహిళల భద్రతను పర్యవేక్షిస్తున్న డీఐజీ స్థాయి అధికారులు సభ్యులుగా ఉంటారని మంత్రి పేర్కొన్నారు. ఈ కమిటీ తన నివేదికను వారం రోజుల్లోగా అందిస్తుందని వెల్లడించారు. ఈ నివేదిక ఆధారంగా విద్యార్థుల భద్రతకు సంభందించి ప్రత్యేక చర్యలు తీసుకోనున్నట్లు- తెలిపారు. ఇలాంటి సంఘటనలు జరగకుండా చూసే బాధ్యతపై ఆయా పాఠశాలల యాజమాన్యాల నుంచి హామీపత్రం తీసుకునే విధంగా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని మంత్రి పేర్కొన్నారు.

## ఉద్యమ ఘట్టాలతో కూడిన యోధ పుస్తకాన్ని ఆవిష్కరించిన మంత్రి కేటీఆర్



హైదరాబాద్, అక్టోబర్ 21: సిద్దిపేట ఉద్యోగ గర్జన దినోత్సవం సందర్భంగా ఉద్యమ ఘట్టాలతో కూడిన 'యోధ' పుస్తకాన్ని మంత్రి కేటీఆర్ శుక్రవారం ఆవిష్కరించారు. ప్రత్యేక తెలంగాణ కోసం ఉద్యమ నేత, ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలో 21-10-2009లో సిద్దిపేటలో ఉద్యోగ గర్జన చేపట్టారు. నాటి ఉద్యోగుల ఉద్యమ నాయకుడు, రాష్ట్ర మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఉద్యమ ప్రస్థానం, ఉద్యమంలో ఉద్యోగుల పాత్ర, ఉద్యమ ప్రధాన ఘట్టాలపై తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘంతోపాటు, ఉద్యోగ జేఏసీ.. 'యోధ' పుస్తకాన్ని రూపొందించారు. ఈ పుస్తకాన్ని మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి హైదరాబాద్‌లో కేటీఆర్ ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమ ఐక్య కార్యచరణ నాయకులతో కలిసి ఉద్యమ కాలంనాటి అనేక పోరాటాలను, ప్రధాన ఘట్టాలను మంత్రి కేటీఆర్ గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో పలువురు ఉద్యోగ జేఏసీ నేతలు పాల్గొన్నారు.

## కేదార్‌నాథ్‌లో ప్రధాని మోదీ పూజలు



న్యూఢిల్లీ, అక్టోబర్ 21: ఉత్తరాఖండ్ పర్యటనలో ఉన్న ప్రధాని మోదీ ఇవాళ కేదార్‌నాథ్‌లో పూజలు నిర్వహించారు. బాబా కేదార్‌కు ఆయన హారతి ఇచ్చారు. ఉదయం 8.30 నిమిషాలకు ఆయన కేదార్‌నాథ్ చేరుకున్నారు. అక్కడ పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఆయన పాల్గొంటారు. ప్రత్యేక వస్త్రధారణలో మోదీ ఆలయాన్ని విజిట్ చేశారు.

హిమాచల్ ప్రదేశ్‌కు చెందిన చంబా మహిళలు చేతితో తయారు చేసిన సంప్రదాయ డ్రెస్సు చోలా దొరను ధరించిన ఆయన ఆలయ దర్శనం చేసుకున్నారు. కేదార్‌నాథ్‌లో ఉన్న ఆది గురువు శంకరాచార్య సమాధిని కూడా ఆయన సందర్శించారు. గౌరికుండ్ నుంచి కేదార్‌నాథ్ వరకు రోప్‌వే ప్రాజెక్టుకు మోదీ శంకుస్థాపన చేయనున్నారు.

ఇవాళ సాయంత్రం బ్రదీనాథ్ కూడా మోదీ వెళ్లనున్నారు. అక్కడ కూడా పలు కార్యక్రమాల్లో ఆయన పాల్గొంటారు.

### చరిత్రలో నేటినిజం





(అక్టోబర్ 22 ఖాదర్‌ఖాన్ జయంతి...)

-రాధశ్రీ

సెల్:9494481210

## నేతన్నల ఆత్మహత్యలు చూసి కేసీఆర్ కన్నీళ్లు పెట్టుకున్నారు : మంత్రి కేటీఆర్



హైదరాబాద్, అక్టోబర్ 21:ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నేతన్నల ఆత్మహత్యలు చూసి కేసీఆర్ కన్నీళ్లు పెట్టుకున్నారని టీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గుర్తు చేశారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గం పరిధిలోని మన్నెగూడలో నిర్వహించిన పద్మశాలీ ఆత్మీయ సమ్మేళనంలో కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు.

వ్యవసాయం తర్వాత రెండో అతిపెద్ద రంగం చేనేత, జౌళి రంగం అని కేటీఆర్ తెలిపారు. ఈ రంగంపై కేసీఆర్‌కు మొదట్నుంచి అవగాహన ఉంది. దుబ్బాకలో హైస్కూల్‌లో చదువుకున్న సమయంలో పద్మశాలీ ఇంట్లో ఉండేవారు. అప్పట్నుంచే చేనేత కళాకారుల కన్నీళ్ల గురించి కేసీఆర్‌కు తెలుసు. భూదాన్ పోచంపల్లిలో ఒకటే వారంలో ఎనిమిది మంది చేనేత కళాకారులు ఆత్మహత్య చేసుకున్నారు. కేసీఆర్ చలించిపోయి, జోలేపట్టి డబ్బులు సేకరించి, లక్ష రూపాయాల చొప్పున ఇచ్చారు. ఎవరూ చావొద్దు. తెలంగాణ వచ్చిన తర్వాత అన్ని కుల వృత్తులను కాపాడుకుంటామని చెప్పారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత ఇప్పుడు చేనేత కళాకారులను కేసీఆర్ ఆదుకుంటున్నారు.

సిరిసిల్లలో కూడా నేతన్నలు ఆత్మహత్యలు చేసుకున్నారు. సిరిసిల్ల గోడల మీద రాతలు చూసి కన్నీళు పెట్టుకున్నారు. నేతన్న చావొద్దు.. నీ కుటుంబం ఉసురు పోసుకోవద్దని నాటి కలెక్టర్ రాయించి, ఆత్మస్థైర్యం నింపారు. సిరిసిల్లలో తొమ్మిది మంది నేతలు బలవన్మరణం పాల్పడితే.. వారిని ఆదుకోవాలని నాటి ముఖ్యమంత్రికి కేసీఆర్ లేఖ రాశారు. కానీ స్పందించలేదు. ఒక పార్లమెంట్ సభ్యుడిగా టీఆర్ఎస్ నుంచి రూ. 50లక్షలు ఇచ్చి సూక్ష్మ రుణాలు ఇవ్వండి. ఆత్మహత్యలు ఆపండి అని కేసీఆర్ నాటి అధికారులను ఆదేశించారు. ఆనాడు మీ కష్టాలను అర్థం చేసుకుని, 2014లో ప్రభుత్వం ఏర్పడిన తర్వాత చేనేత, జౌళి బడ్జెట్ ను రూ. 70 కోట్ల నుంచి రూ. 1200 కోట్లకు పెంచారు. చేనేత, జౌళి శాఖకు ఇప్పటి వరకు రూ. 5,752 కోట్లు ఖర్చు చేశామని తెలిపారు.

డిజైన్లను కాపీ కొడితే కేసులు పెడుతాం..

సిరిసిల్ల, పోచంపల్లి, గద్వాలతో పాటు ఇతర ప్రాంతాల నుంచి అధికారులను పిలిచి సీఎం సమీక్షించారని కేటీఆర్ గుర్తు చేశారు. నెలకు ఎంత ఆదాయం వస్తున్నదని అడిగారు. మీ డిజైన్లను కాపీ కొడితే కఠినంగా కేసులు పెట్టి, లోపల వేయించే బాధ్యత తీసుకుంటాను. అవసరమైతే చట్టాల్లో మార్పులు చేసే దిశగా ముందుకు వెళ్తామన్నారు. చేనేత మిత్ర ద్వారా నలభై శాతం నూలు, రసాయనాల మీద సబ్సిడీ ఇస్తున్నాం. పాత బకాయిలు ఉంటే వాటిని కూడా సంపూర్ణంగా విడుదల చేయిస్తామన్నారు. నేతన్నకు చేయూత అనే కార్యక్రమాన్ని రూపొందించారు. ఈ పథకం ద్వారా కరోనా సమయంలో 26 వేల మంది కార్మికులకు లాభమైందని కేటీఆర్ తెలిపారు.

## ప్రాణాలను అర్పించిన పోలీస్ అమరవీరుల త్యాగాలు మరువలేనివి : ఎస్పీ డా.వినీత్.జి

- అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా ఘనంగా ఏర్పాటు చేసిన "స్మృతి పెరేడ్" కు హాజరైన జిల్లా ఎస్పీ



భద్రాద్రి కొత్తగూడెం, అక్టోబర్ 21 (నేటినిజం ప్రతినిధి) :పోలీస్ ఫ్లాగ్ డే'' సందర్భంగా జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్ నందు స్మృతి పరేడ్ నిర్వహించి, అమరవీరుల స్థూపానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. జిల్లా ఎస్పీ డా. వినీత్. జి ముందుగా పెరేడ్ గ్రౌండ్ కు చేరుకున్న జిల్లా ఎస్పీ సాయుధ జలాల వద్ద నుండి గౌరవ వందనాన్ని స్వీకరించారు. తర్వాత "పుస్తక్ టోలి" పెరేడ్ ద్వారా విధులు నిర్వర్తిస్తూ ముష్కరుల దాడిలో ఈ సంవత్సర కాలంలో అమరులైన వీర జవాన్ల పేర్లతో కూడి ఉన్న పుస్తకాన్ని ఎస్పీ కి అందజేశారు. అనంతరం ఏఆర్ అడిషనల్ ఎస్పీ డి. శ్రీనివాసరావు ఏడాది దేశ సరిహద్దులో పహారా కాస్తూ, దేశ ప్రజల రక్షణకై విధులు నిర్వరిస్తూ దేశ వ్యాప్తంగా అశువులు బాసిన 264 మంది పోలీస్ అమరవీరుల పేర్లను చదివి వినిపించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ అక్టోబర్ 21,1959 సంవత్సరంలో సిఆర్పియఫ్ బలగాలకు చెందిన ఎస్ఐ కరమ్ సింగ్ నాయకత్వంలోని 20 మంది భారత జవాన్లు కలసి లడక్ ప్రాంతంలో హాట్ స్ప్రింగ్ వద్ద విధులు నిర్వహిస్తుండగా చైనా సైన్యం వారిపై దొంగ దాడి చేసి 10 మందిని హతమార్చినదన్నారు. అప్పటి నుండి దేశ వ్యాప్తంగా విధి నిర్వహణలో అసువులు బాసిన పోలీసులను స్మరించుకుంటూ ప్రతి సంవత్సరం అక్టోబర్ 21న పోలీస్ అమరవీరుల సంస్మరణ దినం (పోలీస్ ఫ్లాగ్ డే)ను జరుపుకుంటున్నామని అన్నారు. దేశంలోని ఒక్కొక్క రాష్టంలో ఒక్కొక్క రకమైన సమస్య ఉంటుందని, పొరుగున వున్న మహారాష్ట్ర, ఛతీస్ఘడ్ మరియు అస్సాం వంటి కొన్ని నక్సల్స్ ప్రభావిత రాష్ట్రాలలో ఎంతో మంది జవాన్లను కోల్పోయామన్నారు. ఇతర దేశాలతో సరిహద్దు కలిగి ఉన్న రాష్ట్రాలలో పాకిస్తాన్ ప్రేరిపిత ఉగ్రవాదంతో ఎంతో మంది పోలీసులు, ఆర్మీ జవాన్లు తమ ప్రాణాలను కోల్పోవడం జరుగుతుందని అన్నారు. ఈ విధంగా ఎవరైతే దేశం కోసం విధి నిర్వహణలో ప్రాణ త్యాగం చేస్తారో, వారి ప్రాణ త్యాగాలను స్మరించుకుంటూ శుక్రవారం "పోలీస్ ఫ్లాగ్ డే'' ను జరుపుకుంటున్నామన్నారు. ప్రజల ధన, మాన ప్రాణ రక్షణకై ఏర్పడ్డ వ్యవస్థ పోలీస్ వ్యవస్థ శాంతిభద్రతల పరిరక్షణతో పాటు దేశ అంతర్గత భద్రత, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ లాంటి విధులలో అమరులైన పోలీసుల యొక్క త్యాగాలను గుర్తు చేసుకుంటూ అక్టోబర్ 21 నుండి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి అయిన అక్టోబర్ 31వ తేదీ అయిన "జాతీయ ఐక్యత దినోత్సవం" వరకు ప్రజలకు పోలీసులు మరింత చేరువయ్యేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. అనంతరం పోలీసు అమరవీరుల స్తూపం వద్ద పుష్పమాలను సమర్పించి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా పోలీసు అధికారులు మరియు సిబ్బంది పోలీస్ అమరవీరుల స్థూపానికి నివాళులర్పించారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవ కార్యక్రమాలలో భాగంగా ఏఆర్ హెడ్ క్వార్టర్స్ నందు అధికారులకు మరియు సిబ్బందికి ఏర్పాటు చేసిన వాలీబాల్ మరియు "టగ్ ఆఫ్ వార్" క్రీడలను ఎస్పీ ప్రారంభించారు.

ఈ కార్యక్రమంలో ఏఆర్ అడిషనల్ ఎస్పీ డి.శ్రీనివాసరావు, భద్రాచలం ఏఎస్పీ రోహిత్ రాజ్ ఐపిఎస్, ఏఎస్పీ అక్షాంశ్ యాదవ్, కొత్తగూడెం డిఎస్పీ వెంకటేశ్వర బాబు, ఇల్లందు డిఎస్పీ రమణమూర్తి, మణుగూరు డిఎస్పీ రాఘవేంద్రరావు, పాల్వంచ డిఎస్పీ సత్యనారాయణ, ఏఆర్ డిఎస్పీ సత్యనారాయణ, డీసీఆర్బీ డిఎస్పీ నందీరామ్, ఎస్బి ఇన్స్పెక్టర్స్ స్వామి, రాజు మరియు జిల్లాలోని ఇతర సిఐలు, ఎస్సైలు సిబ్బంది పాల్గొన్నారు.

## గులాబీ కండువా కప్పుకున్న దాసోజు శ్రవణ్, స్వామిగౌడ్



హైదరాబాద్, అక్టోబర్ 21:మునుగోడు ఉప ఎన్నిక పోలింగ్ సమయం సమీపిస్తున్న కొద్దీ భారతీయ జనతా పార్టీకి షాక్‌ల మీద షాక్‌లు తగులుతున్నాయి. తాజాగా దాసోజు శ్రవణ్, స్వామిగౌడ్ టీఆర్ఎస్ పార్టీలో చేరారు. టీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో గులాబీ కండువా కప్పుకున్నారు. నిన్న బూడిద భిక్షమయ్య గౌడ్ బీజేపీకి రాజీనామా చేసి టీఆర్ఎస్ పార్టీలోకి చేరిన విషయం తెలిసిందే.

మునుగోడు ఉప ఎన్నికల్లో బీజేపీ అనుసరిస్తున్న తీరు అత్యంత జుగుప్సాకరంగా ఉందని దాసోజు శ్రవణ్ మండిపడ్డారు. నోట్లు పంచి మునుగోడు ఉప ఎన్నికల్లో గెలవాలను కుంటున్న బీజేపీ తీరు పట్ల నిరసన తెలియజేస్తూ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నానట్లు శ్రవణ్ తెలిపారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలను గుర్తించడంలో బీజేపీ విఫలమైందని స్వామిగౌడ్ స్పష్టం చేశారు. బీజేపీలో ధనవంతులు, కాంట్రాక్టర్లకే ప్రాతినిధ్యం అధికంగా ఉందని పేర్కొన్నారు. బలహీన వర్గాల ఉన్నతికి బీజేపీ సహకరించడం లేదన్నారు.

స్వామిగౌడ్, దాసోజు శ్రవణ్‌పై కేటీఆర్ ప్రశంసలు

గులాబీ కండువా కప్పుకున్న స్వామిగౌడ్, దాసోజు శ్రవణ్‌పై టీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశంసల వర్షం కురిపించారు. కేసీఆర్ నాయకత్వంలో స్వామిగౌడ్ వీరోచిత పోరాటం చేశారని కొనియాడారు. ప్రభావశీలమైన నాయకుడు దాసోజు శ్రవణ్ టీఆర్ఎస్‌లో చేరడం శుభపరిణామం అని పేర్కొన్నారు. దాసోజు శ్రవణ్ సెల్ఫ్ మేడ్ లీడర్ అని కేటీఆర్ ప్రశంసించారు. వీరిద్దరికి కేటీఆర్ గులాబీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.

స్వామిగౌడ్, శ్రవణ్ టీఆర్ఎస్ పార్టీలో చేరడం చాలా సంతోషంగా ఉందని కేటీఆర్ అన్నారు. ఉద్యమ కాలంలో కలిసి పని చేసిన సహచరులం మేం. అక్కడక్కడ ఫంక్షన్లలో, ఇతర కార్యక్రమాల్లో కలుసుకునే వాళ్లం. ఆ సమయంలో పార్టీలను పక్కన పెట్టి ఆప్యాయంగా మాట్లాడుకునే వాళ్లం.. అనుబంధాన్ని పంచుకున్నా.. చాలా సందర్భాల్లో మాట్లాడుకున్నామని గుర్తు చేశారు. మళ్లీ తిరిగి కలిసి పని చేసే గొప్ప అవకాశం కలిగింది. ఉద్యమంలో పని చేసిన ప్రతి బిడ్డ.. తెలంగాణలో జరుగుతున్న రాజకీయాలు, కార్యక్రమాలను గమనించి వందకు వంద శాతం.. తెలంగాణ రాష్ట్ర ప్రజల ప్రయోజనాలను కాపాడే శక్తి కేసీఆర్‌కు మాత్రమే ఉందని అంగీకరిస్తారని అనుకుంటున్నట్టు కేటీఆర్ తెలిపారు.

## ఎస్ఐ, కానిస్టేబుల్ ప్రాథమిక పరీక్ష ఫలితాలు విడుదల

హైదరాబాద్, అక్టోబర్ 21: రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఎస్ఐ, కానిస్టేబుల్ భర్తీ ప్రక్రియలో భాగంగా నిర్వహించిన ప్రాథమిక పరీక్ష ఫలితాలు విడుదలయ్యాయి. ఎస్ఐ, కానిస్టేబుల్, ట్రాన్స్‌పోర్టు కానిస్టేబుల్స్, ప్రొహిబిషన్, ఎక్సైజ్ కానిస్టేబుల్స్ ప్రాథమిక పరీక్షల ఫలితాలను విడుదల చేసినట్లు తెలంగాణ స్టేట్ లెవల్ పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు ప్రకటించింది. 554 ఎస్ఐ పోస్టులకు ఆగస్టు 7వ తేదీన రాత పరీక్ష నిర్వహించిన సంగతి తెలిసిందే. 15,644 కానిస్టేబుల్, 63 ట్రాన్స్‌పోర్టు కానిస్టేబుల్, 614 ప్రొహిబిషన్, ఎక్సైజ్ కానిస్టేబుల్స్ పోస్టులకు ఆగస్టు 28న రాత పరీక్ష నిర్వహించిన విషయం విదితమే.

ఎస్ఐ పోస్టులకు 2,25,668 మంది రాత పరీక్ష రాయగా, 1,05,603(46.80 శాతం) మంది ఉత్తీర్ణత సాధించారు. సివిల్ కానిస్టేబుల్ పోస్టులకు 5,88,891 మంది రాత పరీక్ష రాయగా, 1,84,861(31.39 శాతం) మంది ఉత్తీర్ణత సాధించారు.

## అగ్ని ప్రైమ్, న్యూ జనరేషన్ బాలిస్టిక్ మిస్సైల్ ప్రయోగం సక్సెస్.. భారత్ అమ్ముల పొదిలో మరో సొగసైన అస్త్రం!



న్యూఢిల్లీ, అక్టోబర్ 21:ఒడిశా తీరంలో 'అగ్ని ప్రైమ్' లేటెస్ట్ బాలిస్టిక్ మిస్సైల్?ని భారత్ ఇవ్వాల (శుక్రవారం) విజయవంతంగా ప్రయోగించింది. టెస్ట్ ఫ్లైట్ సమయంలో క్షిపణి తన గరిష్ట పరిధిని దాటి ప్రయాణించిందని. అన్ని లక్ష్యాలను ఈజీగా చేరుకుందని రక్షణ శాఖ అధికారులు తెలిపారు. అగ్ని ప్రైమ్ క్షిపణికి సంబంధించి వరుసగా మూడో ప్రయోగం కూడా విజయవంతమైనట్టు వెల్లడించారు. ఈసారి జరిపిన ఫ్లైట్ టెస్ట్‌తో టార్గెట్‌ని ఛేదించే వ్యవస్థ యొక్క కచ్చితత్వం, విశ్వసనీయత మెరుగైందన్నారు.

రాడార్, టెలిమెట్రీ.. ఎలక్ట్రో ఆప్టికల్ ట్రాకింగ్ సిస్టమ్స్ వంటి అనేక రేంజ్ ఇన్‌స్ట్రుమెంటేషన్స్ ద్వారా పొందిన డేటాను ఉపయోగించి సిస్టమ్ పనితీరు ధ్రువీకరించినట్టు రక్షణ శాఖ అధికారులు తెలిపారు. మొత్తం పథాన్ని కవర్ చేయడానికి టెర్మినల్ పాయింట్ వద్ద రెండు డౌన్ రేంజ్ షిప్‌లతో సహా వివిధ ప్రదేశాల్లో కెమెరాలు ఏర్పాటు చేశారు. ంఖఏ అబ్దుల్ కలాం ద్వీపం నుండి ఉదయం 9:45 గంటలకు మొబైల్ లాంచర్ నుండి సొగసైన ఈ బాలిస్టిక్ మిస్సైల్‌ని టెస్ట్ చేసినట్టు అధికారులు తెలిపారు.

ఘన-ఇంధన డబ్బాతో కూడిన క్షిపణి పరీక్ష సమయంలో అన్ని మిషన్ పారామీటర్‌లను మీట్ అయినట్టు అధికారలు తెలిపారు. దాని నావిగేషన్ అంతా రాడార్లు, వివిధ పాయింట్ల వెంట ఉంచబడిన టెలిమెట్రీ పరికరాల ద్వారా ట్రాక్ చేసినట్టు చెప్పారు. అగ్ని ప్రైమ్ బాలిస్టిక్ క్షిపణుల కొత్త తరం అధునాతన శ్రేణి, దాని స్ట్రోక్ పరిధి 1,000 కి.మీ నుంచి 2,000 కి.మీ మధ్య ఉంటుందని వారు చెప్పారు. గత ఏడాది డిసెంబర్ 18న ఇదే ప్రయోగ కేంద్రం నుంచి చివరిసారిగా క్షిపణి ప్రయోగం నిర్వహించగా, అది కూడా విజయవంతమైంది

## ప్రజల జీవితాలతో చెలగాటమాడుతున్న బీజేపీ: మంత్రి ఎర్రబెల్లి

చండూరు, అక్టోబర్ 21: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌పై మంత్రి ఎర్రబెల్లి దయాకర్ ఫైరయ్యారు. నోరు అదుపులోపెట్టుకుని మాట్లాడాలని సూచించారు. మునుగోడుకు వచ్చి పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చండూరులో ప్రభుత్వ విప్ బాల్క సుమన్‌తో కలిసి మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు మీడియాతో మాట్లాడారు. బీజేపీ నేతలు డబ్బు మదంతో మునుగోడు ప్రజల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారన్నారు. మునుగోడు ప్రజలు చైతన్యవంతులని, భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ఆలోచించి ఓట్లు వేయాలన్నారు.

మునుగోడు ఉపఎన్నికల్లో బీజేపీకి ఓట్లడిగే హక్కు లేదని మంత్రి చెప్పారు. సీఎం కేసీఆర్‌ను చూస్తే బీజేపీ నేతల వెన్నులో వణుకుపుడుతున్నదని వెల్లడించారు. కేసీఆర్‌ను నిలువరించే శక్తి ఎవ్వరికీ లేదన్నారు. మునుగోడులో సీఎం కేసీఆర్ ఫ్లోరైడ్‌ను రూపుమాపారని వెల్లడించారు. అభివృద్ధి చేశాం కాబట్టే తాము ప్రజలను ఓట్లడుగుతున్నామని చెప్పారు. గత ఉపఎన్నికల్లో గెలిచిన నాగార్జునసాగర్, హుజూర్‌నగర్‌లో ఊహకందని విధంగా అభివృద్ధి చేశామన్నారు. కావాలంటే బీజేపీ నాయకులు అక్కడికి వెళ్లి చూడాలన్నారు. జీహెచ్ఎంసీ, దుబ్బాక, హుజూరాబాద్ ఎన్నికల్లో మాయమాటలు చెప్పి ప్రజలను బీజేపీ మోసం చేసిందన్నారు. చౌటుప్పల్‌లో ఫ్లోరైడ్ రీసెర్చ్ సెంటర్ ఏర్పాటు చేస్తామన్న జేపీ నడ్డా హామీ ఏమైందని నిలదీశారు.

## పౌరుల భద్రతే లక్ష్యంగా పోలీసు శాఖలో సంస్కరణలు: డీజీపీ మహేందర్ రెడ్డి

హైదరాబాద్, అక్టోబర్ 21:శాంతి భద్రతల పరిరక్షణలో తెలంగాణ పోలీస్ శాఖ సమర్థవంతంగా పనిచేస్తున్నదని డీజీపీ మహేందర్ రెడ్డి (ఆఉఖ ఓజీష్ట్రవనిటవతీ తీవటటఎ) అన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగంలో దేశంలోనే ముందంజలో ఉన్నామని చెప్పారు. ఒకే రాష్ట్రం, ఒకే సేవ అనే సూత్రంతో స్నేహపూర్వక సేవలు అందిస్తున్నామని వెల్లడించారు. హైదరాబాద్ గోషామహల్ స్టేడియంలో జరిగిన పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం కార్యక్రమానికి హోంమంత్రి మహమూద్ అలీ, డీజీపీ మహేందర్ రెడ్డి హాజరయ్యారు. అమరులైన పోలీసులకు నివాళులర్పించారు. అనంతరం డీజీపీ మహేందర్ రెడ్డి మాట్లాడుతూ.. జవాబుదారీతనం, పారదర్శకత, బాధ్యతాయుత పోలీసు సేవలు అందిస్తున్నామని వెల్లడించారు. రాష్ట్రంలో 15 లక్షల సీసీ కెమెరాల ఏర్పాటే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని చెప్పారు. నేరం చేస్తే శిక్ష నుంచి తప్పించుకోలేని విధంగా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. పౌరుల భద్రతే లక్ష్యంగా పోలీసు శాఖలో ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చామని తెలిపారు.

విధినిర్వహణలో ప్రాణాలర్పించిన అమరులకు నివాళులు అర్పిస్తున్నామన్నారు. ప్రతి ఏడాది అక్టోబర్ 21న పోలీసు అమరవీరుల దినోత్సవం జరుపుకుంటున్నామని చెప్పారు. ఈ ఏడాది 264 మంది పోలీసులు విధి నిర్వహణలో అమరులయ్యారని తెలిపారు. తెలంగాణను నేర రహిత రాష్ట్రంగా మార్చేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. పోలీస్ సంక్షేమమే ధ్యేయంగా సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని వెల్లడించారు. దేశంలోనే రాష్ట్ర పోలీసు వ్యవస్థ ముందుండటం గర్వంగా ఉందని డీజీపీ చెప్పారు.



